www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 1 జనవరి 2024 5

ఏలూరు



# కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె 12వ రోజు ఆదివారం ఏలూరు కలెక్టరేట్ వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు పది రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎస్ఎస్ఎలోని అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్‌రాజు, బాలరాజు, వినోద్‌కుమార్, రఘూన్సీ, వెంకటలక్ష్మి, రమాదేవి, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

**ఎన్నో ఆశలతో నూతన సంవత్సరంలోకి జిల్లా ప్రజానీకం అడుగుపెడుతున్నారు. దీర్ఘకాలికంగా కొనసాగుతున్న సమస్యలకు కొత్త ఏడాది 2024లోనైనా పరిష్కారం దొరుకుతుందని ఆశలు పెట్టుకుంటున్నారు. పోలవరం నిర్వాసితులకు అందించాల్సిన పరిహారం నుంచి అనేక సమస్యలు జిల్లాను పట్టిపీడిస్తున్నాయి. తాగునీటి సమస్య, అధ్వానంగా రోడ్ల వ్యవస్థ, పెరిగిన ధరలు ఇలా అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. కొత్త ప్రభుత్వాలు కొలువుదీరనున్నాయి. ప్రజల ఆదరణ పొంది అధికారంలోకొచ్చే ప్రభుత్వాలైన ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తాయో లేదో వేచిచూడాలి.**

## కొత్త ఏడాదిపై..

# ఆశలు.. ఆకాంక్షలెన్నో..!



- పోలవరం నిర్వాసితులకు పరిహారం అందేనా
- న్యాయం కోసం 'చింతలపూడి' రైతులు ఎదురుచూపు
- అధ్వాన రోడ్ల వ్యవస్థ బాగుపడేనా
- తాగునీటి సమస్యకు పరిష్కారమెప్పుడో
- కౌలురైతులు కన్నీటి వ్యథలు తీరేనా
- కొండెక్కిన ధరలు తగ్గేనా

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

తాము అధికారంలోకొస్తే పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షల నుంచి రూ.పది లక్షలకు పరిహారం పెంచుతామని, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం అందిస్తామని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇస్తామని, భూమికి భూమి సమస్యలు పరిష్కరిస్తామని వైసిపి చెప్పింది. నాడు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ గడిచిన నాలుగున్నరేళ్లుగా పోలవరం నిర్వాసితులు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తూనే ఉన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయి. కొత్త ఏడాదిలోనైనా తమకు ఇచ్చిన హామీ మేరకు పరిహారం ఇవ్వాలని పోలవరం నిర్వాసితులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. వరదల సమయంలో కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెంలో పర్యటించిన సిఎం జనవరి, ఫిబ్రవరిలో నెలల్లో నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం ఇస్తామని ప్రకటించారు. దీంతో ఈ ఏడాదైనా పరిహారం అందుతుందేమోనని నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేస్తామని గత ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్లయినా ఇప్పటికీ నెరవేర్చలేదు. అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.12 లక్షల పరిహారం ప్రకటించగా, బహిరంగ మార్కెట్లో ఎకరా రూ.40 లక్షలుపైనే ఉందని, ఎకరాకు కనీసంగా రూ.30 లక్షలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన వైసిపి నోరు మెదపడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,200 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి రోడ్ల వ్యవస్థ ఉంది. చాలా రోడ్లు అత్యంత దారుణంగా మారాయి. ప్రతిపక్షంలో ఉండగా రోడ్ల గురించి పాదయాత్ర చేసిన నాయకులు ప్రస్తుతం ఎంఎల్ఎలు, ఎంపీలుగా ఉన్నారు. నాలుగున్నరేళ్ల గడిచినా రోడ్లు వేయలేదు. ఆక్వా చెరువుల కారణంగా డెల్టాలో తాగునీరు పూర్తిగా కలుషితమైంది. కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరే పరిస్థితి లేకుండా పోయింది. వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని వైసిపి చెప్పింది. రూ.1400 కోట్లకు సంబంధించి అంచనాలు తయారు చేసినా ఇప్పటి వరకూ అడుగు ముందుకు పడలేదు. దీంతో ఈ ఏడాదైనా ఆయా సమస్యలకు పరిష్కారం చూపాలని జనం కోరుతున్నారు.

**కౌలురైతుల కన్నీటి వ్యథలు**

రెండు జిల్లాల్లో మూడున్నర లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. 80 శాతం ఆయకట్టు సాగులో కౌలురైతులకు ఎటువంటి గుర్తింపూ లేకుండాపోయింది. కౌలుచట్టంలో మార్పులు చేసి వైసిపి ప్రభుత్వం కౌలురైతులను నిలువునా దెబ్బతీసింది. గుర్తింపు కార్డులు, బ్యాంకురుణాలు, పంటనష్టపరిహారం, బీమా ఏఒక్కటీ కౌలురైతులకు అందడం లేదు. గడిచిన ఏడాది రబీ, ఖరీఫ్‌లోనూ వర్షాలు, తుపాన్లు రైతులను నిలువునా దెబ్బతీశాయి. అయినప్పటికీ కౌలురైతులకు ఎటువంటి న్యాయమూ జరగలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నాలుగున్నరేళ్లలో డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ముంపు, నీటిఎద్దడి సమస్యలతో రైతులు బాధపడుతున్నారు. ఆక్వా రైతుల కన్నీటిగాథలు, పామాయిల్ రైతుల కష్టాలు, మొక్కజొన్న రైతుల ఆర్తనాదాలు ఇలా అనేక సమస్యలకు ఈఏడాదైనా పరిష్కారం దొరుకుతుందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

**ధరలతో కుదేలు**

కేంద్రంలో మోడీ ప్రభుత్వం కొలువుదీరాక నిత్యావసరాల ధరల నుంచి పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకి ఎగబాకాయి. దీంతో కందిపప్పు, మినపప్పు వంటి ధరలు కిలో రూ.150పైనే పలుకుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు రూ.వందపైనే ఉన్నాయి. అందుకు తగిన విధంగా ఆదాయ మాత్రం పెరగలేదు. దీంతో సామాన్య ప్రజానీకం బతుకుబండి భారంగా మారింది. 2024లోనైనా ధరలకు కళ్లెం వేసి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలని జనం కోరుతున్నారు.

**భవిష్యత్తు ఒక కల.. వర్తమానం ఒక వాస్తవం.. గతం ఒక జ్ఞాపకం. అనేక అనుభవాల సారాన్ని తనలో ఇముడ్చుకుని.. కష్టసుఖాల సమ్మేళనానికి వేదికైన 2023 ఇక సెలవు అంటూ కాలగమనంలో తెరమరుగైంది. కొత్త ఆశలకు ఊపిరిపోస్తూ నేనొచ్చేశా అంటూ నూతన సంవత్సరం 2024 కోటి ఆశల నడుమ ఆవిష్కృతమైంది. ఉప్పొంగే ఉత్తేజం.. ఊపిరిపోసే ఆశల నడుమ కొత్త సంవత్సరానికి జిల్లావాసులు ఘనస్వాగతం పలికారు.**




### అంతా ఆనందంగా ఉండాలి



**కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**

జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2024లో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలి. జిల్లాలో పంటలు సమృద్ధిగా పండి, విద్యా, పారిశ్రామికపరంగా కూడా మంచి అభివృద్ధి సాధించాలనేది నా ఆకాంక్ష. కరోనా మహమ్మారిని దరి చేరనీయకుండా మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటిస్తూ అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.



### అంతా మంచి జరగాలి

**జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి**

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరంలో అందరికీ అంతా మంచి జరగాలి. ప్రతి ఒక్కరి జీవితంలో 2024వ సంవత్సరం కాంతులు నింపాలి.

# కలెక్టర్ ఉదారత

## మస్తిష్క పక్షవాత బాధిత బాలునికి ప్రత్యేక ఉపకరణం అందజేత

**ప్రజాశక్తి - ఏలూరు**

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తన ఔదార్యాన్ని మరోసారి చాటుకుని మానవతావాదిగా నిలిచారు. జగనన్నకు చెబుదాం..స్పందన కార్యక్రమంలో పెదవేగి మండలం టి.గోకవరానికి చెందిన మాండ్రు చక్రవర్తి అర్జీనిస్తూ తన కుమారుడు మాండ్రు లెమన్ స్టోన్ (4) పుట్టుకతో సెరెబ్రల్ పాల్సీతో బాధపడుతున్నాడని, తన కుమారునికి వైద్య సహాయం అందించాలని కోరారు. బాధిత బాలుడిని చూసి చలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బాలుడికి అవసరమైన వైద్య సహాయం అందించాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. అంతేకాకుండా బాలునికి ఊతంగా నిలిచే రూ.30 వేలు విలువైన సిపి వాకర్, డిబి స్ప్లింట్, యూనివర్సల్ స్ప్లింట్‌తో కూడిన ఉపకరణాలను బెంగుళూరు నుంచి సొంత సొమ్ముతో రప్పించారు. వాటిని శనివారం రాత్రి ఏలూరు కలెక్టరేట్‌లో బాలుని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా మాండ్రు లెమన్ స్టోన్ తల్లిదండ్రులు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెదవేగి తహశీల్దారు ఎన్.నాగరాజు పాల్గొన్నారు.


ఉపకరణం అందిస్తున్న కలెక్టర్


పోలవరంలో..

**అంగన్వాడీల సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. జిల్లాలో పలుచోట్ల వివిధ రూపాల్లో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఆటపాటలతోపాటు పొర్లు దండాలు పెడుతూ ఆందోళన నిర్వహించారు.**

..6లో

# సమ్మెలోకి మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికులు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఏలూరు నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలోని కాంట్రాక్ట్ కార్మికులంతా రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం ఉదయం నుండి విధులు బహిష్కరించి సమ్మె ప్రారంభించారు. వాటర్‌వర్క్స్ విభాగం, హెడ్ వాటర్‌వర్క్స్, పార్కులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వీధిలైట్లు తదితర విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్ట్ కార్మికులు తమ పనులు నిలుపుదల చేసి పంపుల చెరువు వద్ద గల హెడ్ వాటర్ వర్క్స్ మెయిన్ గేట్ వద్ద సమ్మె శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు జీతాలు పెంచే విషయంలో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఐదేళ్లుగా వేచిచూసినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్మికులు సమ్మెబాట పట్టారన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ 2019 ఎన్నికల్లో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా పర్మినెంట్ చేయాలని, లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పిఆర్‌సికి అనుగుణంగా వేతనాలు రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ జగన్ నైపుణ్యం గల పనివాళ్లకు తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. దీంతో ఒక్కో ఇంజనీరింగ్ కార్మికుడు నాలుగున్నరేళ్లలో రూ.3.18 లక్షలు నష్టపోయారన్నారు. తక్షణమే వేతనాల్లో వ్యత్యాసాలు సరిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి వినుకొండ రమేష్, కె.సాంబశివరావు, బి.సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, కానూరు సత్యనారాయణ, ఎంఆర్.శ్రీనివాసరావు, ఉమాశంకర్, రాజు, రామారావు, ఏసునాథ్, రాజు, రాజేష్ నాయకత్వం వహించారు.



ఏలూరులో నినదిస్తున్న మున్సిపల్ కార్మికులు

**జంగారెడ్డిగూడెం:** తమను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వినూత్నరీతిలో వినూత్న రీతిలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె ఆరో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పురుష కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన, మహిళా కార్మికులు నోటితో గడ్డి తిని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బర్రె బాలరాజు మాట్లాడగా నేతలు పసల సూర్యారావు, లక్ష్మణ్, వెంకటేష్, వి.రాజు, పెంటయ్య, డి.రాజు, శాంతయ్య, లాజర్ పాల్గొన్నారు.

# మరోసారి మననం..




### బరులే మారాయి.. కోడిపందేలు యథాతథం.. ★ ★ ★



**జనవరి :** రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ చీకటిమాటున వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జిఒ 1ని రద్దు చేయాలని టిడిపి, వామపక్షాలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టాయి. సంక్రాంతి నేపథ్యంలో జోరుగా సాగిన కోడి పందేల బరుల్లో రాజకీయ వాతావరణం నెలకొంది. మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ అనారోగ్యంతో మృతి చెందారు.

### విద్యాసంస్థల్లో కలకలం.. ★ ★ ★



**ఫిబ్రవరి:** చింతలపూడి బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులు 14 మంది, తణుకులోని ఆకుల బుల్లబ్బాయి 6వ నంబర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులు 15 మంది అస్వస్థతకు గురవ్వడం కలకలం సృష్టించింది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థులుగా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ పేర్లను వైసిపి అధిష్టానం ప్రకటించింది. ఏలూరు సమీపంలోని చొదిమెళ్లలో జరిగిన జోన్-2 సమీక్షా సమావేశంలో టిడిపి అధినేత చంద్రబాబు మాట్లాడుతూ ఆక్వా రైతులకు హామీలు గుప్పించారు.

### ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి గెలుపు.. ★ ★ ★




**మార్చి:** మొగల్తూరు మండలం కెపిపాలెం సౌత్ బీచ్‌లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ గెలుపొందారు. మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ అనూహ్య పరిణామాల నడుమ ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకుని నిర్బంధించడంతో వారి నినాదాలతో ఏలూరు దద్దరిల్లింది. దెందులూరులో ఆసరా నిధులను బటన్ నొక్కి సిఎం జగన్ విడుదల చేశారు. పశ్చిమ రాజకీయాల్లో పెద్దాయన, అజాత శత్రువుగా పేరొందిన మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి కన్నుమూశారు.

### అకాల వర్షం.. అపార నష్టం.. ★ ★ ★



**ఏప్రిల్ :** జిల్లాలో పలు ప్రాంతాల్లో వీచిన ఈదురుగాలులు, కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న, అరటి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఏలూరు రేంజ్ డిఐజిగా అశోక్‌కుమార్, ఏలూరు ఎస్‌పిగా మేరి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్‌గా లావణ్య వేణి నియమితులయ్యారు. మన రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నూజివీడు మండలంలో పర్యటించారు. ఆచంట మండలం భీమలాపురం వద్ద గోదావరిలో దిగి ఇద్దరు విద్యార్థులు గిరిధర్, భానుప్రసాద్ మృతి చెందారు.

### ఎండల తీవ్రతకు విలవిల...



**మే :** రైతు పోరుబాట యాత్రలో భాగంగా చంద్రబాబు రెండు రోజులు తణుకు ప్రాంతంలో పర్యటించారు. వర్షానికి తడిచిన ధాన్యాన్ని చంద్రబాబు పరిశీలించారు. ఈదురుగాలుల బీభత్సంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగ్గా ఒక మహిళ మృతి చెందింది. ఎండల తీవ్రతకు జనం విలవిల్లాడారు.

### మార్మోగిన 'పోలవరం పోరుకేక'..



**జూన్ :** సిఎం జగన్ పోలవరంలో పర్యటించారు. పర్యాటక కేంద్రంగా పోలవరాన్ని తీర్చిదిద్దుతానని ప్రకటించారు. మొగల్తూరులో వివాహ వేడుకకు వచ్చిన ఇద్దరు యువకులు పేరుపాలెం బీచ్‌లో నీట మునిగి మృతి చెందారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, ఆయన కుటుంబ సభ్యుల నివాసాల్లో ఎసిబి నిర్వహించిన తనిఖీల్లో రూ.2.5 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించారు. జనసేన వారాహి యాత్ర జిల్లాలో ప్రవేశించింది. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ పోలవరం పోరుకేక మహా పాదయాత్ర జిల్లాలోని ఏజెన్సీ మండలాలు, ఏలూరు మీదుగా సాగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీ ఎన్నికయ్యారు.

### గోదావరి ఉరకలు.. ★ ★ ★




**జులై :** భీమవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకుల్లో జరిగిన వారాహి యాత్ర సభల్లో పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. అంగన్‌వాడీల 36 గంటల ధర్నాతో కలెక్టరేట్లు దద్దరిల్లాయి. ఆశాలూ ధర్నా నిర్వహించారు. గోదావరి ఉగ్రరూపానికి వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు జలదిగ్బంధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు నీటమునిగిన పంట పొలాలు.

### రాజకీయ యాత్రలు.. ★ ★ ★



**ఆగస్టు:** పెదవేగి జవహర్ నవోదయ పాఠశాలలో ఆహారం కలుషితమై 70 మంది విద్యార్థులకు అస్వస్థత. పోలవరంలో చంద్రబాబు పర్యటించారు. పునరావాస ప్రాంతాల్లో సిఎం జగన్ పర్యటించారు. జిల్లాలో లోకేష్ యువగళం పాదయాత్ర ప్రవేశించింది.

### హత్య, అత్యాచారంతో కలవరం.. ★ ★ ★



**సెప్టెంబర్:** ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాలను సిఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. కారుతో ఢీకొట్టి.. కత్తులతో నరికి భీమవరంలో పట్టపగలే నడిరోడ్డుపై దారుణహత్య చోటుచేసుకోవడం భయభ్రాంతులకు గురిచేసింది. ఒపిఎస్ అమలు కోరుతూ ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. విజయవాడలో ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. భీమవరంలో బాలికపై బాబాయి అత్యాచారానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది.

### ఉమ్మడి జిల్లాలో ఆందోళనలు.. ★ ★ ★



**అక్టోబర్ :** ఏలూరులో నగరంలో సుపారీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. స్థిరాస్తి వ్యాపారిని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురి చేసి.. పిస్టళ్లతో బెదిరించి భయభ్రాంతులకు గురిచేయడం ఫ్యాక్షన్ మాఫియాను తలపించింది. నూజివీడు ట్రిపుల్ ఐటి మెస్‌లో భోజనం సరిగా లేదని, అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థులు ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ ఐకెపి విఒఎలు, మెప్మా ఆర్‌పిలు రోడ్డెక్కారు. వెట్టి చాకిరీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. డిమాండ్లు నెరవేరే వరకూ రాజీలేని పోరాటం చేస్తామంటూ ఏలూరు కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా చేపట్టారు. రహదారిపై వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు.

### మాతా శిశు మరణాలు.. ★ ★ ★




**నవంబర్ :** ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నవజాత శిశువు, గర్భిణి మృతి చెందారు. వైద్యులు సరైన చికిత్స అందించలేదని, అందుకే పండంటి బిడ్డ మృతి చెందిందని నవజాత శిశువు కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆచంట మండలం వల్లూరుతోటలో గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధ దంపతులు మృతి చెందారు.

### విలాపం.. విషాదం.. ★ ★ ★



**డిసెంబర్ :** మిచౌంగ్ తుపాన్ రైతులను, జిల్లా వాసులను తీవ్ర నష్టాల్లో ముంచింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆకివీడు సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం తీవ్ర విషాదం నింపింది. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెబాట పట్టారు.




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్ కృష్ణ, ప్రముఖులు

## 'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ముసునూరు**

ప్రజల కొరకు, ప్రజల పక్షాన పోరాడి ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రజా దినపత్రిక 'ప్రజాశక్తి' అని ముసునూరు మండల వైస్ ఎంపిపి కొటగిరి రాజానాయన పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లోపూడి గ్రామంలో సర్పంచి పేరం కృష్ణ ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర 'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లోపూడి గ్రామ వైసిపి అధ్యక్షులు బి.నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.


జాబితాను ప్రదర్శిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది

## ఆసరా లబ్ధిదారుల జాబితా ప్రదర్శన


**ప్రజాశక్తి - భీమడోలు**

మండలానికి నాలుగవ విడత ఆసరా వాయిదా కింద రూ.12.62 కోట్లు మంజూరయ్యాయని వైఎస్ఆర్ క్రాంతి పథం భీమడోలు ఎపిఎం సురేష్ తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని 1,449 స్వయం సహాయక సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల వారీగా ఎంపికైన స్వయం సహాయక సంఘాల వివరాలను వారి పరిశీలన కోసం డిస్ప్లే బోర్డులో ఉంచినట్టు చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తన కార్యాలయానికి తెలియజేయాలని, దానిపై విచారణ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్.నాగూర్ పాల్గొన్నారు.

## 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

మండలంలోని కేతవరం గ్రామంలో ఈనెల 2వ తేదీన జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2 మెడికల్ క్యాంప్‌ను విజయవంతం చేయాలని కేతవరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్.రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష 'ఫేస్-2 మెడికల్ క్యాంప్ టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జె.కల్యాణ్ రాణి, ఆర్.ఫణీంద్ర బాబుల ఆధ్వర్యంలో జనవరి 2న కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బైరాగి

## మహిళలకు చీరలు పంపిణీ

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని వణుదుర్రులో ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఈడా బైరాగి(రిటైర్డ్ ఉద్యోగి) గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి క్రిస్మస్‌కి పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా గ్రామంలోని 150 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన భార్య బాయమ్మకుమారిలు ఎం.విజయకుమారి, చంద్రలీలా, గ్రామ పెద్దలు శేఖర్ అంజనేయులు, ఐజాక్, రెడ్డియ్య పాల్గొన్నారు.

## స్వర్ణకార కుటుంబం మృతి బాధాకరం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

అనకాపల్లిలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న స్వర్ణకార కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సంతాపం తెలియజేసింది. ఆదివారం స్థానిక ఆర్ఆర్ పేటలోని సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ కృష్ణార్జునలు వారి కుటుంబానికి సంతాపం, సానుభూతి తెలియజేశారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొడవలి శివరామకృష్ణ(45), ఆయన భార్య మాధవి(38), కుమార్తెలు వైష్ణవి(14), జాహ్నవి(12), కుసుమ ప్రియ రాత్రి తెచ్చుకున్న స్వీట్లు, పలావులో పాయిజన్ కలిపి తినడంతో మృతి చెందినట్లు డిఎస్పి సుబ్బరాజు తెలిపినట్లు వారు తెలిపారు.

## 3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ ఈనెల 3వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు కె.విఘ్నేష్ తెలిపారు. స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏలూరు నగరపాలక సంస్థ ముఖ్య కార్యకర్తల సమావేశం వెలగాడ దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భజంత్రి శ్రీనివాసరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే మాట్లాడారు.

**చింతలపూడి :** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఈనెల మూడో తేదీ నుంచి సమ్మెను ప్రారంభం చేయనున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. పట్టణంలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## నేరాలు - ఘోరాలు

### ఆర్టిసి బస్సు ఢీకొని మేకపోతు మృతి

**ముదినేపల్లి :** అతివేగంగా వెళుతున్న ఆర్టీసి బస్సు ఢీకొట్టడంతో మేకపోతు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం ముదినేపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ముదినేపల్లికి చెందిన గోన దావీదు భార్య అంజమ్మ జీవాలను మేపుకొని సాయంత్రం ఇంటికి తోలుకొస్తున్న సమయంలో భీమవరం నుంచి విజయవాడ వెళుతున్న భీమవరం డిపోకు చెందిన డీలక్స్ ఎక్స్‌ప్రెస్ గుడివాడ రోడ్‌లో జాన్సన్ బ్రెల్ కంపెనీ వద్ద జీవాల గుంపును ఢీకొంది. ఈ ఘటనలో రూ.15 వేలు విలువచేసే మేకపోతు మృతి చెందింది. జీవాన్ని ఢీ కొట్టిన బస్సు డ్రైవర్ బస్సును ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లిపోవడంతో కాపరి అంజమ్మ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో వాలీబాల్ ఆడుతున్న యువకులు గమనించి వెంటనే బైకులపై బస్సును వెంబడించి కొదారు అడ్డరోడ్డు వద్ద బస్సును ఆపారు. దీంతో బస్సు డ్రైవర్, యువకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని డ్రైవర్ వివరాలు తీసుకున్నారు. మేకను సంబంధించిన వివరాలను గోన దావీదుని అడిగి తెలుసుకున్నారు. బస్సులో ప్రయాణికులు ఉన్న కారణంగా బస్సును విజయవాడ పంపివేసి తిరుగు ప్రయాణంలో ముదినేపల్లి స్టేషన్‌కు వచ్చి కనబడాలని బస్సు డ్రైవర్‌ను హెచ్చరించారు. ఈ ప్రమాదంపై జీవాలయజమాని గోన దావీదు పోలీసులకు ఫిర్యాదు చేశారు.




జంగారెడ్డిగూడెం: నృత్యం చేస్తున్న అంగన్‌వాడీలు


ముసునూరు : ఒంటికాలుపై నించుని నిరసన

# రేలరేలా నృత్యంతో అంగన్వాడీల నిరసన

### 20వ రోజు సమ్మెలో భాగంగా పలు చోట్ల వినూత్న ప్రదర్శన

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు చేపట్టిన సమ్మె 20వ రోజు కొనసాగింది. ఆదివారం సిఐటియు అధ్యక్షులు పసల సూర్యారావు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్లు సమ్మె శిబిరం వద్ద రేలారేలా నృత్యం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పసల సూర్యారావు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ల సమస్యలను ఎ ిరిష్కరించడంలో ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ పరిధిలోని అంగన్వాడీలు పాల్గొన్నారు.


మండవల్లిలో 20 అంకె రూపంలో ఒదిగి ..

**ఏలూరు అర్బన్ :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మె 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆదివారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద రోడ్డుపై పొర్లు దండాలు పెట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఏలూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు టి.రజిని మాట్లాడుతూ 20 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే అంగన్వాడీల గోడు ఈ ప్రభుత్వానికి పట్టటం లేదన్నారు. అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తానని ఇప్పుడు రోడ్డున పడేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని, స్వప్న, మల్లిక, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, కనకదుర్గ, సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు.


ఏలూరు అర్బన్‌లో పొరివి దండాలు పెడుతూ నిరసన

**కొయ్యలగూడెం :** మండలకేంద్రంలో అంగన్వాడీల నిరసనలు 20 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళలను 20 రోజుల నుంచి రోడ్డు మీద పెట్టి, మీడియా ముందు నవ్వుతూ అంగన్వాడీలను అవహేలన చేస్తున్నారని దుయ్యబట్టారు. 20 రోజులుగా ఎన్ని బెదిరింపులు చేసినా, ఎన్ని అవమానాలు చేసిన బరించాం, తక్షణం సమస్యలు పరిష్కరించకపోతే నిరసనలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివ రత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునితరయల్, బొబ్బిలి చిట్టి పాల్గొన్నారు.

**చింతలపూడి :** అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కి ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చింతలపూడి అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ సెక్రటరి పి.మాణిక్యం అన్నారు. పట్టణంలో ఫైర్ స్టేషన్ వద్ద అంగన్‌వాడీల 20 రోజుల సమ్మెలో భాగంగా వినూత్న నిరసన తెలిపారు. అనంతరం మ్యూజికల్ ఛైర్స్ ఆట, పాటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె తమ డిమాండ్లు అమలు చేసే వరకు విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ, మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, సరళ, కవిత, హేమలత పాల్గొన్నారు.

**నిడమర్రు:** నిడమర్రులో అంగన్వాడీ వర్కర్స్ సమ్మె 20వ రోజు జరిగింది. ఈ సమ్మెకు ఎఫ్‌టిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రంగావల్లి, జిల్లా కార్యదర్శి నిమ్మల జయప్రకాష్, మండల కార్యదర్శి నాయుడు కొండయ్య, మండల అధ్యక్షులు వివి.ప్రసాదు, ఇ.లక్ష్మీనారాయణ బృందం నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నారపల్లి రమణారావు, కె.ప్రేమలత, ఎన్.పార్వతి, కె.జయమ్మ, ఎస్.ధనలక్ష్మి, ఎన్.నాగేశ్వరి కుమారి మద్దతు తెలిపిన ఎఫ్‌టిఎఫ్ నాయకులకు అభినందనలు తెలిపారు.

**జీలుగుమిల్లి :** అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ ఆదివారానికి 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ఆటలు ఆడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతునే వుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కొండలరావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు, సరళ పాల్గొన్నారు.

**కలిదిండి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 20వ రోజు కొనసాగింది. శిబిరం వద్ద కేక్ కట్ చేసి నిరసన తెలిపారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఒబిసి నాయకులు లావేటి వీర శివాజీ శిబిరానికి చేరి సమ్మెకు మద్దతు తెలిపారు. అంగనవాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగనవాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

**మండవల్లి :** నేను ఉన్నాను.. నేను విన్నాను.. ఆదుకుంటాను అని హామీ ఇచ్చి నేడు రోడ్డు మీద పడేయడం ఎంతవరకు సమంజసం అని అంగన్వాడీలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగాయి. 20వ రోజు 20వ అంకె రూపంలో అంగన్వాడీలు ఒదిగి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు వాణి చెల్లమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

**ముసునూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోతే నష్టం చవిచూసే పరిస్థితి వస్తుందని నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయంలో అంగన్వాడీలు ఒంటి కాలుపై నుంచుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గ, మేరీ సులోచన, లక్ష్మీ, విజయలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

**చాట్రాయి :** గత 20 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు, హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం కొనసాగింది. నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరానికి చేరుకొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము ప్రసాద్, దారా సుందర్రావు, నాగార్జున, మురళీ పాల్గొన్నారు.

**పోలవరం :** మండలంలో అంగన్వాడీల సమ్మెలో భాగంగా పోలవరం మెయిన్ రోడ్ సెంటర్‌లో 20వ రోజు 20 ఆకారంలో ఒదిగి ఆటపాటలతో అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్ కుమారి, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమ్మెలో పాల్గొన్నారు.

## ఎంపికైన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**ప్రజాశక్తి - ఏలూరు**

రాష్ట్రస్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి పొంది జాతీయస్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌కు ఎంపికైన చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందడం ఆనందదాయకమన్నారు. ఉత్సాహంగా పనిచేయడం ద్వారా ఇటువంటి మరిన్ని విజయాలు సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్, జిల్లా సైన్సు అధికారి చౌదరి పాల్గొన్నారు.

## చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు పవర్ పేటలోని అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ ఫంగస్ చేపలు సాగు చేస్తున్న రైతులు గత రెండేళ్లుగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫంగస్, ఇతర చేపలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

నాబార్డు రుణం తీసుకుని ఆ రుణం తిరిగి చెల్లించేందుకు సెస్సు రూపంలో రైతులపై భారం వేయడం భావ్యం కాదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెట్ సెస్సు పెంచి రైతులపై భారాలు వేస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రతిఒక్కరూ రెన్యువల్ చేయించుకోవాలి

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ వెల్ఫేర్ బోర్డులో రిజిస్టర్ చేయించుకుని, గుర్తింపు కార్డులు వచ్చిన వారందరూ రూ.25, ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్‌కి సభ్యత్వం కట్టి రెన్యువల్ చేయించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు తెలిపారు. మండల కేంద్రంలో సిఐటియు ఆఫీస్ దగ్గర నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వం రెండు, మూడు తారీకుల్లో కట్టాలని కోరారు.

## మహిళల ఆర్థిక ప్రగతికి 'తపన' చేయూత

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

మహిళల ఆర్థిక ప్రగతికి తపన ఫౌండేషన్ చేయూత నిస్తుందని తపన ఫౌండేషన్ ట్రస్టీ గారపాటి రేణుక అన్నారు. మండలంలోని తిరుమలదేవి పేట, శ్రీరామవరం గ్రామాల్లో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో గత 90 రోజులపాటు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం పూర్తి అయిన సందర్భంగా మండలంలోని తిరుమలదేవి పేటలో మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 80 మంది మహిళలకు రేణుక చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో తర్ఫీదు పొంది మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక పురోగతి సాధించాలనే ఉద్దేశంతో తపన ఫౌండేషన్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 20కి పైగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2008 జనవరి 27న తపన ఫౌండేషన్ ఏర్పాటుచేసి అప్పటి నుంచి వివిధ సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతోందని, రానున్న రోజుల్లో తపన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు, అజయ్, శివ గణేష్ పాల్గొన్నారు.

## క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికే 'ఆడుదాం ఆంధ్రా'

**ప్రజాశక్తి - భీమడోలు**


క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న సర్పంచి

క్రీడల పట్ల ఆసక్తి కలిగి, గుర్తింపు పొందని క్రీడాకారుల ప్రతిభను జిల్లా, రాష్ట్ర, దేశస్థాయి, ఆపై అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వ నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా భీమడోలు హైస్కూల్ ఆవరణ వేదికగా పొలసానిపల్లి వార్డు, గ్రామ సచివాలయాల స్థాయిలో క్రికెట్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీలను గ్రామ సర్పంచి ప్రారంభించారు. తొలి పోటీలో గ్రామానికి చెందిన అనీల్, వెంకన్న నేతృత్వంలోని జట్లు పోటీపడ్డాయి. టాస్ వేసిన సర్పంచి లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి, గ్రామ సచివాలయ స్థాయి సిబ్బంది, అధికారులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## 'మానవత' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి - భీమడోలు**


కలిదిండి : ఆర్థికసాయం చేస్తున్న మానవత సభ్యులు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పులిచర్ల కృష్ణారావు కోరారు. మండలంలోని పూళ్ల గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు కుటుంబాల వారికి మానవత ద్వారా ఆదివారం నిత్యావసర వస్తువులు, బియ్యంతో పాటు దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల శాఖ మాజీ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

**కలిదిండి :** మండలంలోని గుర్వాయిపాలెం పంచాయతీ మద్దవానిగూడెంకు చెందిన నేతల వసంత అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రి ఖర్చులకు కలిదిండి మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఎంపిటిసి గోదావరి సత్యన్నారాయణ రూ.5 వేలు, మూలలంక సర్పంచి మహాదేవ విజయబాబు రూ.వెయ్యి ఆర్థికసాయం అందజేశారు. మానవతా సంస్థ నెలవారీ సమావేశంలో భాగంగా గుర్వాయిపాలెం శ్రీలక్ష్మి ఆలయ అవరణలో జరిగిన సమావేశంలో ఈ కార్యక్రమం జరిగింది. సభ్యులు మారుబోయిన రత్నారావు, చక్కా జగన్మోహనరావు, పత్తి శ్రీను, పోసిన కొండ, సింగవరపు లారెన్స్, మావులూరి బాబూరావు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైంది

### నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంపిపి, జెడ్‌పిటిసి

**ప్రజాశక్తి - చింతలపూడి**

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైందని చింతలపూడి ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి మోలుగుమాటి నిరజా సుధాకర్ అన్నారు. చింతలపూడి పట్టణంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టియు)కి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్స్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిద్దటంలో ఉపాధ్యాయల పాత్ర మరవలేనిదని అన్నారు. ఈ సందర్భంగా అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు రామారావు, కిరణ్ బాబు, బాబురావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాయకులు ఎం.శామ్యూల్, యు.ప్రభాకర్, కె.వేణు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

## వైఎస్ఆర్ పింఛన్ పెంపు

### రేపటి నుంచి పంపిణీకి చర్యలు
### జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

**ప్రజాశక్తి - ఏలూరు**

సామాజిక భద్రత కింద అందజేస్తున్న 'వైఎస్ఆర్ పింఛను' కానుక జనవరి నుంచి మరో రూ.250లు పెంచడం ద్వారా రూ.3 వేలను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదివారం తెలిపారు. కొత్తగా మరో 9,326 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు.

జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆయా మండలాలు, మున్సిపాల్టీల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆమేరకు కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంపుదల కార్యక్రమం ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, కావున అందరూ ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ తేదీని పింఛనుదారులకు వ్యక్తిగతంగా తెలియజేయాలని డిఆర్‌డిఎ పీడీ ద్వారా తెలియజేశారు.

## వేడుకలు కుటుంబ సభ్యులతో జరుపుకోవాలి : సిఐ

**ప్రజాశక్తి - చింతలపూడి**


నూతన సంవత్సరం వేడుకలను కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని, కుటుంబంతో సంతోషంగా గడపాలని చింతలపూడి సిఐ మల్లేశ్వరావు అన్నారు. చింతలపూడి సర్కిల్ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. మీ కోసం ఆధారపడ్డ కుటుంబాలు ఎదురుచూస్తాయని తెలిపారు.

## చిత్రలేఖనం పోటీల్లో జెడ్‌పిహెచ్ విద్యార్థికి ప్రథమ బహుమతి

**ప్రజాశక్తి - ఏలూరు**



జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని ఏలూరు మండల వనరుల కేంద్రంలో 'సేవ్ గర్ల్స్' అనే అంశంపై నిర్వహించిన 'చిత్రలేఖనం' పోటీల్లో సిహెచ్.యతిక్ రమీ 7వ తరగతి, జెడ్‌పిహెచ్ శనివారపు పేట విద్యార్థికి ప్రథమ బహుమతి లభించింది. డివిజన్ స్థాయిలో విజయం సాధించిన వీరు ఈనెల 6వ తేదీన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. విజయం సాధించిన విజేతకు, తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ ఎమ్‌డీ.ఇర్షాద్ అహ్మద్‌కు ప్రధానోపాధ్యాయులు ప్రకాష్‌రావు, కె.రాజ్‌కుమార్, విద్యాకమిటీ, అభివృద్ధి కమిటీ అభినందించారు.


గెలుపొందిన విద్యార్థులు

## అండర్-19 క్రీడల్లో రాణించిన గురుకుల విద్యార్థులు

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

విజయనగరం జిల్లా కొనవలసలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో మండలంలోని బర్రింకలపాడు గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ శివప్రసాద్ ఆదివారం తెలిపారు. అండర్-19 విభాగంలో శ్రీశైలంతో జరిగిన హ్యాండ్‌బాల్ ఫైనల్‌లో కళాశాలలకు చెందిన విద్యార్థులు గెలిచినట్లు తెలిపారు. అదేవిధంగా కబడ్డీ పోటీల్లో రన్నర్‌గా గెలుపొందారన్నారు. అనంతరం జరిగిన షార్ట్ పుట్‌లో కూడా 3వ స్థానం సాధించినట్లు పీడీ ఇన్‌ఛార్జి వై.రత్నాకర్ తెలిపారు. ఆడిన పలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కళాశాల విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## కళాశాలలో క్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**


కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపల్ జాస్మిన్

2023 సంవత్సరంలో దేవుని కృపతో ఎంతో సంతోషంగా ఉన్నామని ముదినేపల్లి ఎస్‌జివి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జాస్మిన్ అన్నారు. క్రిస్మస్, ఈ సంవత్సరం అంతా దేవుడు కాపాడినందుకు కృతజ్ఞతతో కళాశాలలో అధ్యాపకుల సమక్షంలో శనివారం కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. 2024 కొత్త సంవత్సరంలో కూడా దేవుని నిత్య కృప అందరిపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

**ప్రజాశక్తి - ముదినేపల్లి**


ట్యాబ్‌లందిస్తున్న ఎంఎల్ఎ

పేద విద్యార్థులు కూడా ఉన్నత వర్గాల పిల్లలతో సమానంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు, వారిని గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేందుకు వీలుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన చేయిస్తున్నట్లు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి రాచూరి రాధ, పార్టీ మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ పాల్గొన్నారు.